సాక్షి
నిజామాబాద్
గురువారం । 13 । ఏప్రిల్ । 2023



జెడ్పీ చైర్మన్ వర్సెస్ ఎంపీపీ

జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, ఎంపీపీ మాస్త ప్రభాకర్ మధ్య మాక్లూర్‌లో జరిగిన సమావేశంలో వాగ్వాదం జరిగింది.

- 8లో ▸



నియోజకవర్గానికి ఆరు బస్సులు

హైదరాబాద్‌లో అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు వెళ్లేందుకు నియోజకవర్గానికి ఆరు బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
40.4 /25.4

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది.. ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది.

ఇఫ్తార్ గురు: 6:38 | సహర్ శుక్ర: 4:37

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

పీహెచ్‌డీ పూర్తి చేస్తే మరిన్ని అవకాశాలు



తెయూ(డిచ్‌పల్లి) : తెయూ పరిధిలోని అనుబంధ డిగ్రీ, పీజీ కళాశాలల్లో బోధన నిర్వహిస్తున్న అధ్యాపకులు పీహెచ్‌డీ డాక్టరేట్ పూర్తి చేస్తే మరింత ఎక్కువ అవకాశాలు లభిస్తాయని వీసీ ప్రొఫెసర్ డి రవీందర్ అన్నారు. తెయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల సెమినార్ హాల్‌లో బుధవారం తెలుగు అధ్యయన శాఖ ఆధ్వర్యంలో తెలుగు అధ్యాపకులకు 'విభాగ సమావేశం–శిక్షణ తరగతులు' రెండు రోజుల శిక్షణ బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ అధ్యాపకుల అభ్యర్థన మేరకు తెలుగు విభాగంలో ఇంటిగ్రేటెడ్ (ఐదేళ్లు) కోర్సును వర్సిటీ మెయిన్ క్యాంపస్‌తో పాటు భిక్కనూరు సౌత్ క్యాంపస్‌లో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. తెయూ తెలుగు విభాగాధిపతి ఆచార్య కే లావణ్య కేంద్ర సాహిత్య అకాడమీ మెంబర్ గా ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్ ఆరతి, డీన్ ప్రొఫెసర్ పి.కనకయ్య, లావణ్య, అధ్యాపకులు బాల శ్రీనివాసమూర్తి, త్రివేణి, సీహెచ్‌లక్ష్మణ చక్రవర్తి తదితరులున్నారు.

వ్యతిరేకతను తప్పించేందుకే ఆత్మీయ సమావేశాలు



కమ్మర్‌పల్లి : బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మేళనాలు ఆత్మీయ సమ్మేళనాలు కావని అవి వీడ్కోలు సమావేశాలని, బీఆర్ఎస్‌కు ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకోవడానికే సమ్మేళనాలు నిర్వహిస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి విమర్శించారు. బుధవారం కమ్మర్‌పల్లి మండలం నాగాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన హాథ్ సే హాథ్ జోడో యాత్రలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పసుపు బోర్డు తెస్తానని గెలిచిన ఎంపీ అర్వింద్ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని, పసుపునకు మార్కెట్‌లో ధర లేకున్నా స్పందించడం లేదని మండి పడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఏక కాలంలో రూ. 2 లక్షల రుణమాఫీ చేయడంతో పాటు, పసుపు బోర్డు ఏర్పాటు చేసి రూ. 12 వేలు మద్దతు ధరతో పసుపు కొనుగోలు చేస్తామని వెల్లడించారు. పార్టీ మండలాధ్యక్షుడు సుంకెట రవి, నాయకులు తిప్పిరెడ్డి శ్రీనివాస్, వేణు, లింగారెడ్డి, బద్దం తిరుపతి రెడ్డి, బుచ్చి మల్లయ్య, చింతకుంట శ్రీనివాస్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సీఐల బదిలీలు

ఖలీల్‌వాడి : నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇద్దరు సీఐలు బదిలీ అయ్యారు. నిజామాబాద్ సీసీఆర్‌బీలో ఉన్న కాశ్యపురాజు కృష్ణ డిచ్‌పల్లి సీఐగా బదిలీ అయ్యారు. డిచ్‌పల్లి సీఐగా ఉన్న డబేటా మోహన్ సీసీఎస్ నిజామాబాద్‌కు అటాచ్ అయ్యారు. మల్టీ జోన్–1లో జరిగిన బదిలీలో నిజామాబాద్ తొమ్మిది మంది సీఐలను బదిలీ చేయగా, అందులో ఇద్దరు నిజామాబాద్‌కు చెందిన సీఐలు ఉన్నారు. ఈ ఉత్తర్వులను బుధవారం రాత్రి ఐజీ చంద్రశేఖర్ రెడ్డి జారీ చేశారు.

క్రీడాకారిణికి సన్మానం

నిజామాబాద్ నాగారం: హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన రాష్ట్రస్థాయి అండర్–17 రెజ్లింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన విద్యార్థిని సీజ్రా 53 పాల్గొని బంగారు పతకం సాధించింది. ఈసందర్భంగా బుధవారం క్రీడాకారిణిని జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రతినిధులు భక్తవత్సలం సన్మానించి, రూ.2 వేలు ప్రోత్సాహకంగా అందజేశారు. నిజామాబాద్ ఫైర్‌స్టేషన్ అధికారి నర్సింగ్‌రావు, అసోసియేషన్ సభ్యులున్నారు.



పురుగు మందుతో నాణ్యత డొల్ల..

- మన పసుపునకు అంతర్జాతీయ మార్కెట్లో తగ్గుతున్న డిమాండ్
- గరిష్టస్థాయిలో పురుగుమందు అవశేషాలే ప్రధాన కారణం
- 0.01 పీపీఎంకు తగ్గించాలంటున్న యూరోపియన్ మార్కెట్లు



గంజాల అశోక్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : నిజామాబాద్‌తో పాటు చుట్టుపక్కల జిల్లాల్లో పండించే పసుపునకు గతంలో అంతర్జాతీయంగా మంచి డిమాండ్ ఉండేది. రానురాను ఈ డిమాండ్ తగ్గుతూ వస్తోంది. సాగులో సేంద్రియ విధానం తగ్గిపోయి పురుగుమందుల వాడకం పెరగడంతో ఈ పరిస్థితి నెలకొందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అన్ని పంటలకు పురుగుమందుల వాడకం భారీగా పెరిగిందని ప్రభుత్వ అధికారులు, ప్రైవేటు ఎగుమతి కంపెనీల అధికారులు అభిప్రాయపడుతున్నారు. జనవరి 23న హైదరాబాద్‌లో ఫెడరేషన్ ఆఫ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ఎగుమతిదారుల సమావేశం జరిగింది. ఎంఎస్ఎంఈ (మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్) సంస్థ అసిస్టెంట్ డైరక్టర్ సుధీర్‌కుమార్ అంతర్జాతీయ సహకార పథకాలపై మాట్లాడారు. ఏప్రిల్ 2022 నుంచి నవంబర్ 2022 వరకు భారత్ నుంచి 141 మిలియన్ డాలర్ల విలువ జేసే పసుపు ఎగుమతి అయ్యిందన్నారు. కాగా పంట ఉత్పత్తులను అంతర్జాతీయ పోటీలో నిలబెట్టేందుకు అదనపు విలువ సైతం స్థానికంగానే జోడించాల్సి ఉంటుందన్నారు. ఇందుకోసం 'క్లస్టర్ డెవలప్‌మెంట్ స్కీం' అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఐటీసీ నాందేడ్ ప్రొక్యూర్‌మెంట్ మేనేజర్ ప్రసన్న బాబు మాట్లాడుతూ జిల్లాలో అన్ని పంటలకు సంబంధించి పురుగుమందులు ఎక్కువగా వాడుతున్నారన్నారు. పసుపు పంటలో పురుగుమందు అవశేషాలు అనుమతించిన స్థాయికంటే ఎక్కువగా ఉన్నాయన్నారు. దీంతో (ఈయూ) యూరోపియన్ మార్కెట్‌లో తిరస్కరణకు గురవుతోందన్నారు. యూరప్‌లో పసుపు పంట ఉత్పత్తిలో పురుగుమందు (క్లోరిపైరిఫాస్)కు సంబంధించి ఎంఆర్ఎల్ (గరిష్ట అవశేష స్థాయి) 0.05 పీపీఎం నుంచి 0.01 పీపీఎంకు తగ్గించారన్నారు. ఇది సేంద్రియ సాగుకు సమానమన్నారు. తేమ శాతం కూడా ఎక్కువగా ఉంటే రీప్రాసెసింగ్ చేయాల్సి వస్తోందన్నారు. నిజామాబాద్‌లో ప్రాంతీయ సుగంధ ద్రవ్యాల బోర్డు సమర్థంగా పనిచేస్తున్న నేపథ్యంలో, ఎంఎస్ఎంఈల ద్వారా ఎఫ్‌పీవో (ఫార్మర్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజేషన్స్) సేంద్రియ సాగుకు ప్రాధాన్యమిస్తే ఎగుమతులు పెంచొచ్చన్నారు. ఎఫ్‌పీవోల ద్వారా గ్రేడింగ్ చేస్తే ఇక్కడే అదనపు విలువ జోడించినట్లవుతుందన్నారు. నేరుగా రైలు ద్వారా ఎగుమతులు చేయవచ్చన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1.5 లక్షల ఎకరాల్లో పసుపు సాగు కాగా, అత్యధికంగా నిజామాబాద్‌లో 35 వేల ఎకరాలు సాగవుతోంది.

✦ ఎకరానికి పసుపు 120 నుంచి 140 క్వింటాళ్ల పచ్చి పసుపు దిగుబడి వస్తుంది. ఉడకబెట్టి పాలిష్ చేశాక 22 నుంచి 25 క్వింటాళ్లు వస్తుంది. రాష్ట్రంలో పండించే పసుపులో 3 శాతం వరకు 'కర్క్యుమిన్' వస్తోంది. నిజామాబాద్ మార్కెట్‌కు ప్రతి ఏటా సుమారు 10 లక్షల క్వింటాళ్ల పసుపు వస్తోంది.

వివిధ జిల్లాల్లో పసుపు సాగు (ఎకరాల్లో)	
నిజామాబాద్	35,000
జగిత్యాల	25,000
నిర్మల్	20,000
వరంగల్	6,000
వికారాబాద్	3,500
మహబూబాబాద్	4,500
హన్మకొండ	2,800
భూపాలపల్లి	1,200

(ఆదిలాబాద్, పెద్దపల్లి, సంగారెడ్డి, కరీంనగర్ జిల్లాల్లో మోస్తరుగా, ఇతర జిల్లాల్లో స్వల్పంగా సాగవుతోంది)

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



నాణ్యమైన పసుపు దిగుబడి లభించాలంటే రైతులు సేంద్రియ సాగును అవలంభించాల్సి ఉంది. రైతులు రసాయనాల శాతం సాధ్యమైనంత తగ్గించాలని, సేంద్రియ ఎరువులను వినియోగించాలనే విషయమై అవగాహన కల్పిస్తున్నాం. పసుపు సాగు చేసే పొలాల్లో మొదటగా పశువుల పేడ పోయిస్తున్నాం. సాగు సమయంలో క్రిమిసంహారక మందులు, ఎరువులు వినియోగించడం కారణంగా 'కర్క్యుమిన్' శాతం తగ్గిపోతోంది. కర్క్యుమిన్ శాతం ఎక్కువ వచ్చేలా చేసేందుకు రైతులకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం.

–మహేందర్, శాస్త్రవేత్త, పసుపు పరిశోధన కేంద్రం, కమ్మర్‌పల్లి

పశువు పేడతో మరింత మేలు..



పశువుల పేడ వినియోగిస్తే భూసారం పెరుగుతుంది. ఎరువులు, పురుగుమందుల వాడకం అవసరం ఉండదు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు దశలవారీగా సేంద్రియ సాగుకు మళ్లేందుకు ముందుకు వెళ్లాలి. ప్రభుత్వం సైతం ఈ దిశగా తగిన సహకారం అందించాలి. – ఆలూరు గంగారెడ్డి, రైతు, ఆలూరు

సేంద్రియ ఎరువులను సబ్సిడీపై అందించాలి

సేంద్రియ ఎరువులను వినియోగించి పసుపు సాగు చేసే రైతులకు ప్రభుత్వం ఆయా ఎరువులను సబ్సిడీపై అందించాలి. రైతులను ప్రోత్సహిస్తే సేంద్రియ ఎరువులను ఎక్కువగా వినియోగిస్తారు. అనేక మంది రైతులు సేంద్రియం సాగువైపు ఆసక్తి చూపుతున్నారు. పశు సంపదను పెంచాల్సిన అవసరం ఉంది. పశు సంపద పెరిగితేనే సేంద్రియ ఎరువులు అందుబాటులోకి వస్తాయి. పసుపు సాగుకు ప్రత్యేకంగా సేంద్రియ ఎరువులను సరఫరా చేస్తేనే బాగుంటుంది. – గంజాల అశోక్, రైతు, శెట్‌పల్లి

ఎక్కువ ఖర్చు చేస్తున్నారు



పసుపు సాగులో సేంద్రియ ఎరువులకు ఎంత ఖర్చు అవుతుందో రసాయన ఎరువులకూ అంతకంటే ఎక్కువ ఖర్చు అవుతోంది. రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందుల కోసం ఒక్కో ఎకరానికి రూ.25 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. రైతులకు శిక్షణ ఇప్పిస్తే రసాయనాల శాతం తగ్గించే అవకాశం ఉంది.

– బీజీ గంగారాం, రైతు, తిమ్మాపూర్

పాపం పసివాడు...





రైలు ప్రమాదంలో ఎడమ కాలు కోల్పోయిన అద్నాన్

- రైలు దిగుతుండగా పట్టు తప్పి చక్రాల కిందికి వెళ్లిన బాలుడు
- తెగిపోయిన ఎడమ కాలు.. మోకాలు పైభాగం వరకు తొలగించిన వైద్యులు
- డిచ్‌పల్లి రైల్వేస్టేషన్‌లో ఘటన.. కన్నీరు పెట్టిన పలువురు

నిజామాబాద్ సిటీ/డిచ్‌పల్లి : రెప్ప పాటులో జరిగిన రైలు ప్రమాదంలో మూడేళ్ల బాలుడు తన ఎడమ కాలును కోల్పోయాడు. డిచ్‌పల్లి రైల్వేస్టేషన్‌లో బుధవారం చోటు చేసుకున్న ఈ ఘటనలో బాలుడు నరకయాతన అనుభవించడం అక్కడున్న వారిని కన్నీరు పెట్టించింది. డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గ్రామానికి చెందిన సాజిర తన కొడుకు అద్నాన్‌ను వెంట తీసుకుని అత్త షాహిదతో కలిసి హైదరాబాద్ వెళ్లడానికి డిచ్‌పల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. ప్లాట్‌ఫాంపై ఆగి ఉన్న కాచిగూడ– పెద్దపల్లి (కరీంనగర్) డెము రైలులోకి అద్నాన్‌ను తీసుకుని నానమ్మ షాహిద ఎక్కింది. సాజిర టికెట్ తీసుకునేందుకు వెళ్లింది. ఆ రైలు హైదరాబాద్‌కు వెళ్లదని ఇతర ప్రయాణికులు చెప్పడంతో అద్నాన్‌ను తీసుకుని షాహిద కిందకు దిగుతుండగా ప్రమాదం చోటుచేసుకుంది. రైలు కదలడంలో పట్టుతప్పి అద్నాన్ ఫ్లాట్‌ఫామ్‌కు, రైలుకు మధ్యలో పడిపోయాడు. రైలు చక్రాల కింద పడి అతడి ఎడమకాలు తెగిపోయింది. కొందరు ప్రయాణికులు స్టేషన్‌మాస్టర్‌ను అప్రమత్తం చేయడంతో రైలును ఆపివేశారు. ఆటోలో బాలుడిని తెగిన కాలుతో సహా జిల్లా జనరల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాలుడిను పరీక్షించిన వైద్యులు తెగిన కాలుకు ఇన్‌ఫెక్షన్ సోకుతుండటంతో మెకాలు పై భాగం వరకు తొలగించి సర్జరీ చేశారు.

మధ్యాహం మొదలుపెట్టిన సర్జరీ సాయంత్రం వరకు పూర్తయ్యింది. అనంతరం బాలుడిని ఐసీయూ వార్డుకు మార్చారు. కొడుకు పరిస్థితి చూసిన తల్లి సాజీరా, నాన్నమ్మలు గుండెలు బాదుకుంటూ పెట్టిన రోదనలు ఆస్పత్రిలో విషాదం నింపింది. బాలుడికి ఎక్కువగా తాత వద్ద చనువు ఉండటంతో ప్రతిక్షణం బాలుడు దాదా దాదా అంటూ కలవరిస్తున్నాడు. బాలుడి తండ్రి రఫీక్ 20 రోజుల క్రితమే బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశానికి వెళ్లాడు.



ఆస్పత్రిలో రోదిస్తున్న అద్నాన్ తల్లి సాజిర, నానమ్మ షాహిద, బంధువులు

ఎక్కేటప్పుడు.. దిగేటప్పుడు భద్రం



- రైల్వే ప్రమాదాలపై జాగ్రత్తలు సూచిస్తున్న అధికారులు

ఖలీల్‌వాడి : రైల్వే ప్రయాణికులు ప్రయాణ సందర్భాల్లో పలు సూచనలు పాటించాలని అధికారులు, రైల్వే పోలీసులు సూచిస్తున్నారు.

✦ ఫుట్‌పాత్‌పైన రైలు వచ్చే టప్పుడు దూరంగా ఉండాలి. రైళ్ల రాకపోకలపై అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలి.

✦ ప్రయాణికులు రైలు ఆగిన తరువాత ఎక్కాలి. రైలు నడుస్తున్న సమయంలో ఎక్కితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది.

✦ ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన ట్రాక్‌ల పైనే నడవాలి. రైలు పట్టాలపై నుంచి వెళ్లొద్దు.

✦ గతంలో రైలు పట్టాలు దాటే సమయంలో ప్రమాదాలు జరిగిన ఘటనలు ఉన్నాయి. ఎందరో అవయవాలను కోల్పోయారు. రైలులో ప్రయాణించేటప్పుడు వారికి కేటాయించిన సీట్లలోనే కూర్చోవాలి. డోర్ల వద్ద నిలబడితే బ్యాలెన్స్ తప్పిపోయి ప్రమాదం జరగొచ్చు.

సూచనలు పాటించాలి

రైల్వే అధికారుల సూచనల మేరకు ప్రయాణికులు ప్రయాణం చేయాలి. అలా చేస్తే ప్రమాదాలు జరుగవు. రైల్వేపట్టాలను దాటవద్దు. రైల్వే ఏర్పాటు చేసిన వంతెనలపై నుంచే వెళ్లాలి. రైళ్లు ఆగిన తరువాతనే ఎక్కి సురక్షిత ప్రయాణం చేయాలి.

– ప్రణయ్, రైల్వే ఎస్సై, నిజామాబాద్

టీఎన్జీవో ఎన్నికలు ఏకగ్రీవం



నూతనంగా ఎన్నికైన జిల్లా టీఎన్జీవో కార్యవర్గం

- నాలుగోసారి జిల్లా అధ్యక్షుడిగా అలుక కిషన్
- మూడేళ్లపాటు కొనసాగనున్న కార్యవర్గం

సుభాష్‌నగర్ : తెలంగాణ నాన్ గెజిటెడ్ ఎంప్లాయిస్ యూనియన్ (టీఎన్జీవో) ఎన్నికలు బుధవారం నిర్వహించగా, కార్యవర్గం మొత్తం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆకుల ప్రసాద్ ఎన్నికల అధికారిగా, గురుచరణ్, ప్రమోద్‌కుమార్ సహాయ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. 2023–26కు గాను అన్ని పదవులకు నామినేషన్లు ఒక్కొక్కటి మాత్రమే దాఖలయ్యాయి. దీంతో ఎన్నికల అధికారులు కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఈ జిల్లా కార్యవర్గం మూడేళ్ల పాటు కొనసాగనుంది.

ఉద్యోగులకు అందుబాటులో ఉంటూ..

టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడిగా అలుక కిషన్ నాలుగోసారి ఎన్నికయ్యారు. ఉద్యోగులకు అందుబాటులో ఉంటూ.. మంత్రి, జిల్లా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో సమన్వయం ఆయన ఏకగ్రీవ ఎన్నికకు దోహదపడుతున్నాయని ఉద్యోగులు పేర్కొంటున్నారు. సుమారు 12వేలపై చిలుకు సభ్యత్వం కలిగిన టీఎన్జీవోకు వరుసగా నాలుగోసారి అధ్యక్షుడిగా ఎన్నిక కావడం గమనార్హం.

నూతన కార్యవర్గం..

టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడిగా అలుక కిషన్, జిల్లా కార్యదర్శిగా నేతికుంట శేఖర్ (వ్యవసాయ), సహాధ్యక్షులుగా చిట్టి నారాయణరెడ్డి, కోశాధికారిగా గంధం వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా పెద్దోళ్ల నాగరాజు (వైద్య), వేణుగోపాల్ (రెవెన్యూ), పురుషోత్తం (ఆడిట్), శంకర్ (విద్య), కేపీ సునీత (నీటిపారుదల) సంయుక్త కార్యదర్శిగా కే సత్యం (వెల్ఫేర్), జాఫర్ హుస్సేన్, కాసాలి శ్రీనివాస్ (సర్వే) అతిక్ అహ్మద్ (ఆర్ అండ్ బి) వసుమతి దేవి (సర్వే) ఆర్గనైజింగ్ సెక్రటరీగా పోల శ్రీనివాస్, మాణిక్యం జిల్లా కార్యవర్గ సభ్యులుగా మహేష్‌కుమార్, నిరంజన్ గౌడ్, రవీందర్, సంజీవయ్య, ప్రకాష్, రాజేశ్వర్, ఆనంద్‌బాబు, సాయిలు, ఆనంద్ కుమార్, ఉమా కిరణ్, మంజుల, విజయలక్ష్మి, ఇంద్ర, పారిజాతం, గీతారెడ్డి, సంధ్యారాణి ఎన్నికయ్యారు.

ఓటర్ జాబితాపై నిర్లక్ష్యం వద్దు

- పేర్ల తొలగింపుపై ఫిర్యాదులు రావొద్దు
- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్ : ఓటరు జాబితాలో పేరు తొలగించారంటూ అర్హులైన ఏ ఒక్క ఓటరు నుంచి కూడా ఫిర్యాదులు రాకుండా జాబితా పకడ్బందీగా, పూర్తి పారదర్శకంగా రూపొందించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ సూచించారు. బుధవారం ఆయన ఎన్నికల జాబితా, బూత్ లెవెల్ అధికారుల నియామకం, ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఎన్నికల ఏడాది కావడంతో ఓటరు జాబితాను పునఃపరిశీలించుకుని లోటుపాట్లు ఉంటే సరి చేసుకోవాలన్నారు. మృతి చెందిన, ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఓటర్ల వివరాలు ఒకటికి రెండుసార్లు పరిశీలించి తొలగించాలన్నారు. ఫిర్యాదులు వస్తే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారితో వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఆర్డీఓలు, తహసీల్దార్లు, నియోజకవర్గ ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులతో కలెక్టర్ సమావేశమై పలు సూచనలు చేశారు. 39వేల పైచిలుకు మంది పేర్లు వివిధ కారణాలతో ఓటరు జాబితా నుంచి తొలగించారన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్‌డీవో చందర్, జెడ్పీ సీఈవో గోవింద్, ఆర్డీఓలు రవి, రాజేశ్వర్, శ్రీనివాసులు, అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల తహసీల్దార్లు, సహాయ ఈఆర్‌వోలు, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, తదితరులు పాల్గొన్నారు.

పక్కా ప్రణాళికతో ధాన్యం సేకరణ

సుభాష్‌నగర్ : ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా ధాన్యం సేకరణ ప్రక్రియను సాఫీగా నిర్వహించేందుకుగాను సమగ్ర ప్రణాళికతో ముందుకెళ్లాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి కొత్త కలెక్టరేట్‌లో బుధవారం ఆయా శాఖల అధికారులు, సొసైటీల చైర్మన్లు, సీఈఓలు, ఐకేపీ సీసీలు, రైస్‌మిల్లర్లతో కలెక్టర్ సన్నాహక సమావేశం నిర్వహించారు. తూకం, తరుగు వంటి అంశాల్లో జాగ్రత్తగా ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులు నష్టపోకుండా పకడ్బందీ పర్యవేక్షణ కొనసాగించాలన్నారు. ఎఫ్ఏక్యూ నాణ్యతాప్రమాణాలకు లోబడి ధాన్యం తీసుకొచ్చే రైతులకు ప్రభుత్వ మద్దతు ధర అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. గతేడాది ఇదే సీజన్‌లో 6.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించగా, ఈసారి సుమారు 9 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాల్సిన అవసరం ఉందని అంచనా వేశామన్నారు. 467 కేంద్రాల ద్వారా ప్రతిరోజూ సగటున 18వేల నుంచి 20వేల మెట్రిక్ టన్నుల చొప్పున ధాన్యం సేకరిస్తే లక్ష్యాన్ని నిర్ణయించిన గడువులోగా పూర్తిచేయవచ్చన్నారు. గన్నీ బ్యాగులు రెండు, మూడు రోజుల్లో అన్ని కేంద్రాలకు సమకూరుస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఎస్ఓ చంద్రప్రకాశ్, డీసీఓ సింహాచలం, డీఏఓ తిరుమల ప్రసాద్, డీఎం జగదీశ్‌కుమార్, డీటీసీ వెంకటరమణ, డీఆర్డీఓ చందర్, మెప్మా పీడీ రాములు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పీహెచ్‌సీ పరిశీలన



రుద్రూర్‌: పోతంగల్‌ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జాతీయ నాణ్యత ప్రమాణాల (ఎన్‌క్యూఏఎస్‌) బృందం సభ్యులు ఎలంగోవన్‌, ఆరోకియ మేరీ సందర్శించారు. ఆస్పత్రి రికార్డులు పరిశీలించారు. ఆస్పత్రి పరిసరాలు, పరిశుభ్రత, ల్యాబ్‌, ఓపీ వివరాలు, రోగులకు అందిస్తున్న వైద్య సేవలను తనిఖీ చేశారు. వారు రెండు రోజుల పాటు ఇక్కడ రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలిస్తారు. అనంతరం ఆయా విభాగాల్లో సర్టిఫికెట్‌ కోసం సిపార్సు చేస్తారు. డీఎంహెచ్‌వో సుదర్శనం, డిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య, ప్రోగ్రాం అధికారి విశాల్‌, వైద్యాధికారిణి సుప్రియ, హెల్త్‌ సూపర్‌వైజర్‌ కృష్ణవేణీ, జ్యోతి ఉన్నారు.

24 గంటలు వైద్యసేవలందించాలి



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ హెల్త్‌సెంటర్‌ వైద్యులు విద్యార్థులకు 24 గంటలు అందుబాటులో ఉండి వైద్యసేవలందించాలని వీసీ డి రవీందర్‌ ఆదేశించారు. హెల్త్‌ సెంటర్‌ను బుధవారం వీసీ తనిఖీ చేశారు. డాక్టర్‌ అనూషతో మాట్లాడి వివరాలు తెలుసుకుని పలు సూచనలు ఇచ్చారు. రాత్రి సమయంలో విద్యార్థులకు వైద్యసేవలందించేందుకు మేల్‌ నర్స్‌లు అందుబాటులోఉండేలా చూడాలని విద్యార్థి నాయకులు వీసీని కోరారు.

సీనియర్‌ ప్రొఫెసర్‌లుగా పదోన్నతి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు ప్రొఫెసర్లకు సీనియర్‌ ప్రొఫెసర్లుగా పదోన్నతి లభించింది. కామర్స్‌ డీన్‌ ప్రొఫెసర్‌ యాదగిరి, బిజినెస్‌ మేనేజ్‌మెంట్‌ ప్రొఫెసర్‌ ఖైసర్‌ మహ్మద్‌, కంట్రోలర్‌ ఎం అరుణ సీనియర్‌ ప్రొఫెసర్లుగా పదోన్నతి పొందారు. ఈ మేరకు ముగ్గురికి వీసీ డి రవీందర్‌, రిజిస్ట్రార్‌ విద్యావర్ధిని ఉత్తర్వులు అందజేశారు.

న్యాయ విద్యార్థులకు మౌఖిక పరీక్ష



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఎల్‌ఎల్‌బీ ఐదో సెమిస్టర్‌ విద్యార్థులకు బుధవారం లా కాలేజీలో మౌఖిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. బీవోఎస్‌ చైర్మన్‌ జెట్లింగ్‌ ఎల్లోసా అధ్యక్షతన జరిగిన ఈ పరీక్షలకు నిజామాబాద్‌ సీనియర్‌ న్యాయవాది రామాగౌడ్‌ ఎక్స్‌టర్నల్‌ ఎగ్జామినర్‌గా వ్యవహించారు. ప్రత్యామ్నాయ వివాదాల పరిష్కారాల విషయంలో నిర్వహించిన ఈ పరీక్షలకు విషయ పరిజ్ఞాన టీచర్‌గా ఎం నాగజ్యోతి వ్యవహరించారు. లా కాలేజీ ప్రిన్సిపాల్‌ ప్రసన్న రాణి, హెచ్‌వోడీ స్రవంతి పాల్గొన్నారు.

నియోజకవర్గానికి ఆరు బస్సులు

- రేపు హైదరాబాద్‌లో అంబేడ్కర్‌ విగ్రహావిష్కరణ
- ప్రజల తరలింపు కోసం అధికారుల ఏర్పాట్లు



ఖలీల్‌వాడి: డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ జయంతిని పురస్కరించుకొని ప్రభుత్వం ఈ నెల 14న హైదరాబాద్‌లో ఆయన భారీ విగ్రహాన్ని ప్రభుత్వం ఆవిష్కరించనుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రజలను భాగస్వాములు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాలోని ఆరు ఆర్టీసీ డిపోల నుంచి తొమ్మిది నియోజకవర్గాలకు ఆరు చొప్పున 54 బస్సులను ఈ కార్యక్రమానికి పంపనున్నారు. విగ్రహావిష్కరణకు మండలానికి 50 మంది చొప్పున హైదరాబాద్‌కు తరలించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మధ్యాహ్నం 1.30 గంటలకు విగ్రహావిష్కరణ సభా వేదిక వద్దకు ఉమ్మడి జిల్లా ప్రజలను చేర్చేలా అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మండలాలనికి ఒక ఇన్‌చార్జిని ఏర్పాటు చేసి వారికి కావాల్సిన సౌకర్యాలను కల్పించనున్నట్లు తెలిసింది. ప్రతి బస్సులో ఒక పోలీస్‌ కానిస్టేబుల్‌ తోపాటు ఏదైనా శాఖకు చెందిన మరో అధికారిని వెంట ఉండేలా ఏర్పాట్లు చేశారు. విగ్రహ ఆవిష్కరణ అనంతరం తిరిగి వాహనాల ద్వారా వెళ్లడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటీవల నిర్వహించిన ఆదివాసీ సభ తరహాలోనే ఈ కార్యక్రమాన్ని చేయాలని ప్రభుత్వం యోచించినట్లు తెలుస్తోంది. ఉమ్మడి నిజామాబాద్‌ నుంచి 2700 మందిని విగ్రహ ఆవిష్కరణకు వెళ్లనున్నట్లు తెలిసింది. అంబేడ్కర్‌ విగ్రహావిష్కరణకు కొంత మంది అభిమానులు, కులసంఘాలు, బీఆర్‌ఎస్‌ శ్రేణులు హైదరాబాద్‌కు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ కార్యక్రమానికి వెళ్లాలని ఆసక్తి ఉన్న ఆర్థిక సోమత్త లేని వారికి కోసం ప్రభుత్వం బస్సులను నియోజకవర్గానికి ఆరు చొప్పున ఏర్పాట్లు చేశారు. కుల సంఘాలు, వివిధ సంస్థలను ప్రభుత్వం భాగస్వామ్యం చేస్తుంది. మండల స్థాయి అధికారులు జాబితాను తయారు చేసి ప్రజలను హైదరాబాద్‌ తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

అంబేడ్కర్‌ ఆశయాలను కొనసాగిద్దాం



కాగడాల ప్రదర్శన చేస్తున్న నాయకులు

సుభాష్‌నగర్‌: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ ఆశయాలను కొనసాగించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధన్‌పాల్‌ సూర్యనారాయణగుప్తా పేర్కొన్నారు. రాష్ట్ర శాఖ పిలుపుమేరకు బుధవారం నగరంలో బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు బిఆర్‌ శివప్రసాద్‌ ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి ధన్‌పాల్‌ ముఖ్యఅతిథి హాజరై మాట్లాడారు. తెలంగాణలో దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని చెప్పి సీఎం కేసీఆర్‌ మొట్టమొదట దళిత సోదరులను మోసం చేశారన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం దళితులను అక్కున చేర్చుకుంటుంటే, కేసీఆర్‌ ప్రభుత్వం దళిత ఉపముఖ్యమంత్రిని తొలగించడం సిగ్గుచేటన్నారు. కేసీఆర్‌ ఇచ్చిన మాట ప్రకారం వెంటనే ఇప్పటికైనా దళిత ముఖ్యమంత్రిని ప్రకటించి, దళితులకు మూడు ఎకరాల భూమి ఇవ్వాలన్నారు. నాయకులు కుమార్‌, బాలకృష్ణ, సందీప్‌, నాగోల్ల లక్ష్మీనారాయణ, గడ్డం రాజు, రోషన్‌లాల్‌ బోర, స్వామి యాదవ్‌, కిషోర్‌ తదితరులు పాల్గొన్నారు.

సామాజికశాస్త్ర పరిశోధనలో ప్రశ్నావళి కీలకం



శిక్షణనిస్తున్న రవీందర్‌రెడ్డి

తెయూ(డిచ్‌పల్లి): సామాజిక శాస్త్ర పరిశోధనలో ప్రశ్నావళి కీలక భూమిక పోషిస్తుందని రిసోర్స్‌పర్సన్‌ కే రవీందర్‌రెడ్డి అన్నారు. తెయూ క్యాంపస్‌లో ఇండియన్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ సోషల్‌ సైన్స్‌ రీసెర్చ్‌ (ఐసీఎస్‌ఎస్‌ఆర్‌) సౌతర్న్‌ రీజనల్‌ సెంటర్‌, తెలంగాణ యూనివర్సిటీ భాగస్వామ్యంలో 'ఆన్‌సైట్‌ రీసెర్చ్‌ మెథడాలజీ కోర్స్‌ పర్‌ పీహెచ్‌డీ స్టూడెంట్స్‌ /యంగ్‌ ఫ్యాకల్టీ ఇన్‌ సోషల్‌ సైన్స్‌' అనే అంశంపై మూడో రోజు శిక్షణలో ఆయన అవగాహన కల్పించారు. ప్రతి లక్ష్యానికి అనుగుణంగా ప్రశ్నావళి ప్రధానంగా ఉండాలని ఆయన సూచించారు. ప్రశ్నావళికి, షెడ్యూల్‌కు మధ్య తేడాను అర్థం చేసుకోవాలన్నారు. రెండో సెషన్‌లో రిసోర్స్‌ పర్సన్‌ జి శ్రీనివాసులు డాటా సోర్సెస్‌ ఇన్‌క్లూడింగ్‌ ఈ రిసోర్స్‌ అనే అంశంపై అవగాహన కల్పించారు.

పూర్వ విద్యార్థినుల ఆత్మీయ సమ్మేళనం



గురువులను సన్మానిస్తున్న 1993-94 బ్యాచ్‌ విద్యార్థినులు

దోమకొండ: దోమకొండ బాలికల ఉన్నత పాఠశాలలో 1993-94లో పదో తరగతి చదివిన విద్యార్థినులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన తమ గురువులు భూపాల్‌రెడ్డి, మురళీధర్‌రావ్‌ను సన్మానించారు. పూర్వ విద్యార్థినులు సరస్వతి, కోమల, వసంత చంద్రకళ, అరుణ, లక్ష్మి, అనసూయ, సుకన్య, బాలమణి, శోభ, శ్రీలత, సునీత, మంజుల, కవిత, మీనా, వసంత, లత పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి



గాంధారి: రైతులు సస్యరక్షణ కోసం వ్యవసాయశాఖ అధికారుల సూచనలు పాటించాలని ఎల్లారెడ్డి ఏడీఏ రత్న అన్నారు. బుధవారం ఆమె మండలంలోని పోతంగల్‌ ఖుర్దు శివారులో వరి పొలాలను పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. ఏవో నరేష్‌, రైతులు ఉన్నారు.

బీసీ సెల్‌ డైరెక్టర్‌గా ఆరతి



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ బీసీ సెల్‌ డైరెక్టర్‌గా కంప్యూటర్‌ సైన్స్‌ ప్రొఫెసర్‌ ఆరతి నియామకమయ్యారు. వీసీ రవీందర్‌ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్‌ విద్యావర్ధిని బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆరతి ఏడాది పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు.

ప్రశాంతంగా ఒకేషనల్‌ పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్‌: జిల్లాలో బుధవారం ఒకేషనల్‌ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. 16 సెంటర్లలో 1,489 మంది విద్యార్థులకు 1,466 మంది పరీక్ష రాశారు. డీఈవో దుర్గాప్రసాద్‌ మూడు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

నేటి నుంచి 'పది' మూల్యాంకనం

నేటి నుంచి నగరంలోని నిర్మలహృదయ పాఠశాలలో పదో తరగతి స్పాట్‌ వాల్యూయేషన్‌ ప్రారంభిచనున్నట్లు డీఈవో దుర్గాప్రసాద్‌ ఒక ప్రకటనలో తెలిపారు.సంబంధిత టీచర్లు తప్పకుండా హాజరు కావాలని ఆదేశించారు. లేదంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దాడి ఘటనలో ఒకరి అరెస్ట్‌

సిరికొండ: మండలంలోని తాటిపల్లి గ్రామంలో ధర్మేంద్ర అనే వ్యక్తిపై దాడి చేసిన కేసులో కసన్‌లాల్‌ను బుధవారం అరెస్ట్‌ చేసి రిమాండ్‌ చేసినట్లు ఎస్సై నర్సింలు తెలిపారు. ఈ నెల 4న ధర్మేంద్రను డబ్బుల విషయంలో కసన్‌లాల్‌ అనే వ్యక్తి ముఖంపై కర్రతో దాడి చేయగా ఎముక విరిగి బలమైన గాయమైందని ఎస్సై తెలిపారు.

జెడ్పీ చైర్మన్‌ వర్సెస్‌ ఎంపీపీ

- నువ్వెంత అంటే నువ్వెంత అనుకున్న వైనం
- మాక్లూర్‌లో బాలల హక్కుల పరిరక్షణ సమావేశంలో ఘటన



వాగ్వాదం చేసుకుంటున్న జెడ్పీ చైర్మన్‌ విఠల్‌రావు, ఎంపీపీ ప్రభాకర్‌

మాక్లూర్‌: జెడ్పీ చైర్మన్‌ దాదన్నగారి విఠల్‌రావు, ఎంపీపీ మాస్త ప్రభాకర్‌ మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. బుధవారం మండల పరిషత్‌ కార్యాలయంలో జరిగిన బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సమావేశంలో అధికారుల సాక్షిగా ఇద్దరు నేతలు నువ్వెంత అంటే నువ్వెంత అనుకున్నారు. బాలల హక్కుల పరిరక్షణపై మండల పరిషత్‌లో ఉదయం 11 గంటలకు సమావేశం ఉందని ఒక్క రోజు ముందే సమాచారం ఇచ్చారు. షెడ్యూల్‌ ప్రకారం జెడ్పీ చైర్మన్‌ విఠల్‌రావు ఉదయం పదిన్నర గంటలకే మండల కార్యాలయానికి చేరుకున్నారు. 11 గంటలకు సమావేశం ప్రారంభం అయింది. కొద్ది సమయం వ్యవధిలోనే ఎంపీపీ ప్రభాకర్‌ సమావేశం హాల్‌లోకి వచ్చారు. ఆయన రాగానే జెడ్పీ చైర్మన్‌ ఆగ్రహం వ్యక్తం చేశారు. ''సమయానికి హాజరు కావాలని తెలియదా.. ఎప్పుడు నీ పద్ధతి ఇంతే.. జెడ్పీ చైర్మన్‌ అయి ఉండి నేను నిజామాబాద్‌ నుంచి వస్తే మాక్లూర్‌లో ఉండి కూడా ఆలస్యంగా వస్తావా'' అంటూ మండిపడ్డారు. దీంతో ఎంపీపీ సైతం అదే స్థాయిలో మండిపడ్డారు. సమావేశం ఉన్న విషయం తనకు ఎవరు చెప్పారని నిలదీశారు. అసలు తనకు తెలియకుండా ఇక్కడ సమావేశం ఎలా నిర్వహిస్తావని తిరగబడ్డారు. ఇలా మొదలైన వాగ్వాదం నువ్వెంత అంటే నువ్వెంత అనే స్థాయికి చేరుకుంది. చివరకు వేదికపై ఉన్న ఎంపీడీవో మరికొందరు అధికారులు జోక్యం చేసుకొని ఇరువురిని శాంతింపజేశారు. అనంతరం బాలల హక్కుల సమావేశం కొనసాగింది. మండల కమిటీని నియమించారు.

కొలతల ప్రకారం పనులు చేయాలి



గుంతలు తవ్వి చూపిస్తున్న డీఆర్‌డీవో సాయన్న

గాంధారి(ఎల్లారెడ్డి):ఉపాధి హామీ కూలీలు నిబంధనల మేరకు సరైన కొలతలతో పని చేస్తేనే గిట్టుబాటు కూలి లభిస్తుందని డీఆర్‌డీవో సాయన్న అన్నారు. బుధవారం ఆయన మండలంలోని సీతాయిపల్లి శివారులో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలకు పలు సూచనలు చేశారు. ఇద్దరు కూలీలు కలిసి 4.1 మీటర్ల పొడవు, ఒక మీటరు వెడల్పు, 0.5 మీటర్ల లోతు గుంతలు తీసినట్లయితే ఒక్కొక్కరికి రూ.272 కూలి గిట్టుబాటు అవుతుందన్నారు. మీరు చెప్పిన కొలతల ప్రకారం మట్టి వస్తలేదని కూలీలు అనగా స్వయంగా మట్టిని తవ్వి చూయించారు. ఎంపీడీవో సతీష్‌, ఉపాధిహామీ సిబ్బంది ఉన్నారు.

'ఇస్రో యువిక'కు విద్యార్థిని ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బీబీపేట: మండలంలోని మాందాపూర్‌ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న పందిరి తన్విరెడ్డి అనే విద్యార్థిని ఇస్రో యువికా - 2023 యంగ్‌ సైంటిస్టు ప్రోగ్రాంకు ఎంపికైంది. శ్రీహరికోటలోని అంతరిక్ష పరిశోధన కేంద్రంలో మే 15 నుంచి 26 వరకు శాస్త్రవేత్తలు ఇచ్చే శిక్షణకు తన్విరెడ్డి ఎంపికైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థినిని బుధవారం వారు అభినందించారు.

రోడ్డును ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం



సామగ్రిని స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ మున్సిపల్‌ పరిధిలో రోడ్డును ఆక్రమించి వ్యాపార సంబంధిత వస్తువులు ఏర్పాటు చేస్తే యజమానులపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్‌ కమిషనర్‌ ప్రసాద్‌ చౌహాన్‌ హెచ్చరించారు. ఆర్మూర్‌ పరిధిలో మంథని బ్లాక్‌, న్యూ బస్టాండ్‌, మామిడిపల్లిలోని వ్యాపారులు రోడ్డుపై ఉంచిన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఇక నుంచి వాహనదారులు, ప్రజలకు ఇబ్బందులు కలిగించినట్లయితే మున్సిపల్‌ యాక్ట్‌-2019 ప్రకారం వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. షాపునకు సంబంధించిన ప్రకటన బోర్డులు సైతం రోడ్డుపై ఏర్పాటు చేయవద్దని ఆయన పేర్కొన్నారు.

ప్రియుడితో కలిసి భర్తను చంపిన భార్య



వివరాలు వెల్లడిస్తున్న సీఐ తిరుపయ్య

భిక్కనూరు: వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని కట్టుకున్న భర్తను ప్రియుడితో కలిసి హతమార్చిందో భార్య. ఈ ఘటన భిక్కనూరు మండలం జంగంపల్లిలో చోటు చేసుకుంది. బుధవారం సీఐ తిరుపయ్య కేసు వివరాలు వెల్లడించారు. జంగంపల్లికి చెందిన బండెల బాబు, లావణ్య దంపతులు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాబు ముంబాయిలో పనిచేస్తు కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆరు నెలల క్రితం లావణ్యకు ఎల్లారెడ్డి మండలం కొక్కొండ గ్రామానికి చెందిన దర్శనాల సాయిలుతో పరిచయం ఏర్పడింది. అది వివాహేతర సంబంధంగా మారింది. తమ బంధానికి ఎలాంటి ఆటంకం ఉండొద్దంటే బాబును హతమార్చాలని లావణ్య, సాయిలు పథకం రచించారు. ఈ క్రమంలో ముంబాయి నుంచి వచ్చిన బాబుకు ఈ నెల 3న ఇంట్లోనే లావణ్య, సాయిలు మద్యం తాగించారు. అనంతరం సెల్‌ఫోన్‌ చార్జర్‌ వైర్‌ గొంతుకు బిగించి, తలదిండుతో ముఖంపై ఒత్తి ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. అనంతరం తమకు ఏమీ తెలియనట్లు నటించారు. బాబు మృతిపై ఆయన కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో లావణ్య, సాయిలు బాబును హత్య చేసినట్లు ఒప్పుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తిరుపయ్య వివరించారు. సమావేశంలో ఎస్సై ఆనంద్‌గౌడ్‌, కానిస్టేబుళ్లు వెంకటరాములు, నవనీత, రేణుకా ఉన్నారు.

విద్యుత్‌ వైర్లకు తగిలి హార్వెస్టర్‌ దగ్ధం



కాలిపోతున్న హార్వెస్టర్‌, డీసీఎం

ఎడపల్లి: మండలంలోని కుర్నాపల్లి గ్రామ శివారులో బుధవారం డీసీఎం వ్యానుపై వరి కోత మిషన్‌ను తీసుకువెళ్తుండగా 11 కేవీ విద్యుత్‌ వైర్లు తగిలి దగ్ధమైంది. కోత మిషన్‌తో పాటు డీసీఎం వాహనానికి కూడా మంటలు అంటుకున్నాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. విద్యుత్‌ షాక్‌ తగిలి మంటలు అంటుకోవడంతో డ్రైవర్‌ వాహనాన్ని నిలిపి కిందకు దూకేశాడు. దీంతో డ్రైవర్‌ ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. స్థానికులు విద్యుత్‌ సరఫరాను నిలిపి వేయించి మంటలను ఆర్పి వేశారు.

చోరీ కేసులో ఏడాది జైలు

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్‌లో ఏడాది క్రితం ఓ ఇంట్లో జరిగిన దొంగతనం కేసులో నిందితుడికి ఒక సంవత్సరం జైలుశిక్ష పడింది. ఈ కేసుకు సంబంధించి స్థానిక ఎస్సై రాజశేఖర్‌ తెలిపిన వివరాలు.. హాసాకొత్తూర్‌ గ్రామానికి చెందిన దాస రమ్యశ్రీ ఇంట్లో గతేడాది జనవరి 22 అర్ధరాత్రి దొంగలు పడి బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. ఆర్మూర్‌ మండలం పిప్రి గ్రామానికి చెందిన ఆలకుంట శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి దొంగిలించిన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై ఆర్మూర్‌ కోర్టులో చార్జ్‌షీట్‌ దాఖలు చేశారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన అడిషనల్‌ జ్యూడిషియల్‌ ఫస్ట్‌ క్లాస్‌ మేజిస్ట్రేట్‌ నేరస్తుడికి ఒక సంవత్సరం సాధారణ జైలుశిక్షతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. జరిమానా చెల్లించక పోతే మరొక నెల సాధారణ జైలుశిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు.

చోరీకి యత్నించిన కేసులో..

మాచారెడ్డి: మాచారెడ్డి మండలం పాల్వంచ గ్రామంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో దొంగతనానికి యత్నించిన కేసులో నిందితులకు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ కామారెడ్డి కోర్టు బుధవారం తీర్పు వెల్లడించింది. వివరాలు ఇలా ఉన్నాయి. 2021లో పాల్వంచలో చోరీకి యత్నించిన ఇద్దరు దొంగలను గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వారిపై పోలీసులు కేసు నమోదు చేసి కోర్టుకు రిమాండ్‌కు అదేరోజున తరలించారు. ఈ కేసులో సాక్ష్యాలు పరిశీలించిన ప్రథమ శ్రేణి న్యాయమూర్తి వెంకటేష్‌ దుర్వ నేరం నిందితులైన మాన్సింగ్‌ పంచాయ్‌, మహబత్‌ బచాహకు ఆరు నెలల జైలు శిక్ష, రూ.200 చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన మాచారెడ్డి ఎస్సై సంతోష్‌కుమార్‌, పోలీసు, కోర్టు సిబ్బందిని ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు.

సమ్మర్‌ క్రీడలు ప్రారంభం

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్‌లోని గిరిరాజ్‌ కళాశాలలో బుధవారం సమ్మర్‌ క్రీడలు ప్రారంభం అయ్యాయి. ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ రామ్‌మోహన్‌రెడ్డి వాలీబాల్‌ టోర్నమెంట్‌ను టాస్‌ వేసి ప్రారంభించారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ప్రవీణ్‌(ఫైల్‌)

మద్నూర్‌: మండలంలోని హండే కేలూర్‌ గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మంగళవారం రాత్రి దేగ్లూర్‌కు చెందిన కంచిన్‌వార్‌ ప్రవీణ్‌(27) మృతి చెందినట్లు ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు. వివరాలు.. మహారాష్ట్రలోని దేగ్లూర్‌ పట్టణానికి చెందిన ప్రవీణ్‌ మద్నూర్‌లో వైన్‌షాప్‌ బిజినెస్‌ చేస్తాడు. నిత్యం మద్నూర్‌-దేగ్లూర్‌కు రాకపోకలు సాగిస్తాడు. మంగళవారం వైన్‌షాప్‌లో పనులు ముగించుకొని రాత్రి పది గంటల ప్రాంతంలో ద్విచక్ర వాహనంపై దేగ్లూర్‌కు వెళ్తుండగా హండెకేలూర్‌ శివారులో సర్వీస్‌ రోడ్డుపై ప్రమాదం జరిగి తలకు బలమైన గాయాలు కావడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. స్థానికులు ప్రవీణ్‌ను దేగ్లూర్‌లోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే ప్రవీణ్‌ మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. ప్రవీణ్‌ తనకు తానుగా బైక్‌పై నుంచి పడి మృతి చెందాడ లేక గుర్తు తెలియని వాహనం ఢీకొందా అనే కోణంలో దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, 20 రోజుల బాబు ఉన్నాడని ఆయన తెలిపారు.


గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు..

సదాశివనగర్‌: మండలంలోని కల్వరాల్‌ శివారులో 44వ జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందినట్లు ఎస్సై రాజేశ్‌ తెలిపారు. వివరాలు.. మండలంలోని వజ్జపల్లి గ్రామానికి చెందిన సాకలి ఎర్రన్న(45)కు మతిస్థిమితం లేక రోడ్లపై తిరుగుతున్నాడు. మంగళవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఎర్రన్నను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

డ్రంకన్‌ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

దోమకొండ: మండల కేంద్రంలో బుధవారం డ్రంకన్‌డ్రైవ్‌ నిర్వహించగా ముత్యంపేట గ్రామానికి చెందిన శ్రీనివాస్‌, భిక్కనూరు మండలం కంచర్ల గ్రామానికి చెందిన యశ్వంత్‌రెడ్డి మద్యంతాగి వాహనాలు నడుపుతూ పట్టుబడినట్లు ఎస్సై సుధాకర్‌ తెలిపారు. వీరిని కోర్టులో హాజరు పరుచగా, కామారెడ్డి ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి ప్రతాప్‌ రెండు రోజుల జైలుశిక్షతో పాటు రూ.2వేల చొప్పున జరిమానా విధించినట్లు చెప్పారు.


వృద్ధురాలి అదృశ్యం



సైదగోని రామవ్వ

లింగంపేట: మండలంలోని పొల్కంపేట గ్రామానికి చెందిన సైదగోని రామవ్వ (60) అదృశ్యమైనట్లు ఎస్సై శంకర్‌ తెలిపారు. వివరాలు.. రామవ్వ, ఆమె కోడలు బుధవారం ఇంటి పని విషయంలో మాటా మాటా అనుకున్నారు. ఆమె కుమారుడు వారికి నచ్చజెప్పి పొలం పనులకు వెళ్లాడు. రామవ్వ ఉదయం 9 గంటలకు మనుమళ్లను స్కూల్‌లో వదిలేసి రావడానికి వెళ్లి ఇంటికి రాలేదు. మధ్యాహ్నం ఆమె కుమారుడు మోహన్‌గౌడ్‌ పొలం నుంచి వచ్చి చూడగా రామవ్వ ఇంట్లో లేదు. భార్య స్వాతిని అడగ్గా పిల్లలను స్కూల్‌కు తీసుకెళ్లి తిరిగి రాలేదని చెప్పింది. గ్రామంలో, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ అభించలేదు. దీంతో లింగంపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆర్టీసీ బస్సులో పొగలు



వర్ని: మండలంలోని శ్రీనగర్‌ గ్రామం వద్ద బుధవారం మధ్యాహ్నం బాన్సువాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో పొగలు రావడంతో నిలిపివేశారు. బాన్సువాడ నుంచి నిజామాబాద్‌ వెళ్తున్న బస్సు శ్రీనగర్‌కు రాగానే పొగలు రావడంతో అప్రమత్తమైన డ్రైవర్‌ వెంటనే బస్సును నిలిపివేసి ప్రయాణికులను వేరే బస్సులో గమ్యస్థానానికి తరలించారు.

ఒకరిపై కేసు నమోదు

మోపాల్‌: మండలంలోని బాడ్సికి చెందిన ఆల్లూరి శ్రీనివాస్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేష్‌ తెలిపారు. మంగళవారం రాత్రి మోపాల్‌లో డ్రంకన్‌ డ్రైవ్‌ నిర్వహిస్తుండగా తాగిన మత్తులో శ్రీనివాస్‌రెడ్డి పోలీసులతో దురుసుగా ప్రవర్తించాడని చెప్పారు. ఈ విషయమై ఆయనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.